క్లుప్తంగా

నేటి నుంచి పది పరీక్షలు ప్రారంభం



పరీక్షలకు సిద్ధం అవుతున్న పదో తరగతి విద్యార్థులు

తాళ్లూరు: పది పరీక్షలు విద్యార్థులకు భవిష్యత్‌లో మంచి విజయాన్ని అందించేందుకు దోహదపడతాయి. సంవత్సరం అంతా పడిన కష్టానికి ప్రతిఫలంగా ఎటువంటి భయం లేకుండా పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొని ప్రశాంతంగా రాస్తే మంచి మార్కులు వస్తాయని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అంటున్నారు. మండలంలో 6 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 825 మంది పదవ తరగతి విద్యార్థులు హాజరు కానున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

పుల్లలచెరువు: మత సామరస్యానికే ప్రతీక రంజాన్ అని యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం చాపలమడుగు సర్పంచ్ టి.సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పుల్లలచెరువు జామియా మసీదులో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక నవాజు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొని ఉపవాసం ఉన్న ముస్లింలకు వడ్డించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నాయకులు కోటిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, రఘు, ఉమామహేశ్వరరెడ్డి, బి.సుబ్బారెడ్డి, గాలిరెడ్డి, జబీబుల్లా, ఎల్.రాములు, రవణారెడ్డి, వీరారెడ్డి, దినేష్‌యాదవ్, యూసఫ్ ఖాన్, ఖాదర్, సుందరరావు, కాశయ్య, హనుమంతరావు, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రితో విద్యార్థులు

దొనకొండ: స్థానిక వీవీపురం ఎస్సీ కాలనీ 10వ తరగతి విద్యార్థులకు ప్రభు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఆదిమూలపు ప్రభుదాసు అట్టలు, పెన్నులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్నట్లు ప్రభుదాసు వివరించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

టంగుటూరు: పిల్లలు విధిగా గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేయాలని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధన్‌రాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. పుస్తక పఠనంతో సృజనాత్మకత పెంపొందుతుందన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే

కొండపి: మద్యం తాగి వాహనం నడిపితే జైలుకు పంపిస్తామని ఎస్సై ప్రేమ్ కుమార్ వాహనదారులను హెచ్చరించారు. స్థానిక కామేపల్లి సెంటర్‌లో ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏఎస్సై అంకారావు, కానిస్టేబుల్ సుధాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం, నగదు చోరీ

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు గ్రామంలో చోరీ జరిగిన ఘటన ఆదివారం రాత్రి బయటపడింది. వివరాలు.. గ్రామానికి చెందిన పోకూరి రాఘవులు శెట్టి కుటుంబం శుక్రవారం రాత్రి యాత్రకు వెళ్లారు. వెళ్తూ బంధువులను చూస్తుండమని చెప్పి వెళ్లారు. ఎప్పటిలానే ఆదివారం రాత్రి బంధువులు వెళ్లి పరిశీలించగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే ఇంటి యజమానికి తెలియపరిచారు. బీరువా కూడా పగులగొట్టి నగదు తీసుకుని వెళ్లారు. బీరువాలో సుమారు రూ. 5 లక్షల నగదు, 2 నుంచి 4 సవర్ల బంగారం ఉందని వారు తెలిపారు. వారు యాత్ర నుంచి సోమవారం వస్తారని బంధువులు తెలిపారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని ఎస్సై అంకమ్మ ఆదివారం రాత్రి పరిశీలించారు. బాధితులు వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఆత్మత్యాగం చేసిన మహానుభావుడు పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



దోర్నాలలో రోగులకు చీరలు, పండ్లు బ్రెడ్‌లు పంపిణీ చేస్తున్న సభ్యులు

● ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: ఆంధ్రరాష్ట్ర కోసం తన ప్రాణాలర్పించిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసి గొప్ప వ్యక్తిగా నిలిచారని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కె.ఓబులరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, వివిధ విభాగాల నాయకులు ఎం.బాలగురవయ్య, ఒంగోలు సుబ్బారెడ్డి, సయ్యద్ జబీవుల్లా, టి.సత్యనారాయణరెడ్డి, సూరె ప్రసాద్, షేక్ వలి, సూరె శ్రీనివాసులు, దోగిపర్తి సంతోష్ కుమార్, టి.రాంబాబు, కోటిరెడ్డి పాల్గొన్నారు.

దోర్నాలలో..

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆర్య వైశ్య సంఘం, షిర్డీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో నటరాజ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలో రోగులకు చీరలు, చిన్నారుల కిట్లు, బ్రెడ్‌లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ లావణ్య, షిర్డీ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు తంగిరాల రామిరెడ్డి, బొగ్గరపు రమేష్, మొగిలి గుప్త, పబ్బతి సుబ్బారావు, చీదెళ్ల గురుమూర్తి, గజవల్లి శేఖర్, డాక్టర్ ప్రసాద్, జక్కా సుబ్బారావు, పుల్లారావు, మొగిలి మహాలక్ష్మమ్మ, బొంతల లక్ష్మీదేవి, మొగిలి శిరీష, యక్కలి సునీత తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న అతిథులు

దర్శి: నియోజకవర్గంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఐ రామారావు, ఎస్సై మురళీలు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ పట్టు దల గల వ్యక్తి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విశ్రాంత డీటీసీ గంగవరపు ఆదినారాయణ, ఎస్ఎస్ సీహెచ్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

– దర్శి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దనిరెడ్డి వెంకటరెడ్డి, దేవత ప్రసాద్, సభ్యులు పాపసాని రాజకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: దొనకొండలోని బ్రహ్మరావుపేట రామాలయంలో ఆర్య వైశ్యులు ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరులో ఏఎస్సై వెంకటేశ్వరరెడి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం మాజీ మండల అధ్యక్షుడు పులికొండ శ్రీనువాసరావు పాల్గొన్నారు.



దొనకొండలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మానవత సభ్యులు



దర్శిలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న పోలీసులు

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

దర్శి (ముండ్లమూరు): ముండ్లమూరు ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పూర్ణ చంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూ ఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి మార్కులు ఆధారంగా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు ఇస్తారన్నారు. జిల్లాలోని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గుంటి గంగ అమ్మవారు

తాళ్లూరు: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం గుంటిగంగ భవాని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని తూర్పు గంగవరం సోమవర్పపాడు పంచాయతీ పరిధిలో అమ్మవారిని మల్లికార్జునస్వామి వారిని, నాగమ్మ తల్లిని శిలలను, ఆదివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పొంగళ్లు పెట్టి, నైవేద్యాలు ప్రసాదాలు, జంతుబలులు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని అర్చకులు పి. విజయ లక్ష్మి, ఎం.బాలరాజు, కామేశ్వర శర్మ అలంకరించారు. ఈఓ గుంటపల్లి, వాసు, ఆర్‌ఏకే ప్రసాద్‌రావు, ఆలయ చైర్మన్ కె.గురుబ్రహ్మం పాల్గొని భక్తులకు వసతులు సమకూర్చారు.

అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటికి కటకట



నిలిచిపోయిన నీటి సరఫరా



మరమ్మతులకు గురైన విద్యుత్ మోటార్లు

● మూడు మోటార్లున్నా? చుక్కనీరు కరువు
● ఎండలు మండుతున్నా పట్టించుకోని అధికారులు
● రక్షితనీటి సరఫరా నిలుపుదల

కురిచేడు: వేసవి కాలంలో అధికారుల అలసత్వం కారణంగా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 14 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చేందుకు 40 సంవత్సరాల క్రితం ఎస్ఏపీ రక్షిత నీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి ప్రజల తాగునీటి సమస్య కొంతమేర తీరినట్లయింది. ప్రతి ఏడాది వేసవి ఆరంభం అవుతుందనగానే సాగర్ కాలువ ద్వారా వచ్చే నీటితో రక్షిత నీటి చెరువులను నింపి మండల ప్రజలకు దాహార్తి తీర్చేవారు. ఈ ఏడాది వేసవి ఆరంభమైనా నీరు సరఫరా సక్రమంగా చేయటం లేదు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి మండలంలోని గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. స్థానిక ఎస్ఏపీ పంప్‌హౌస్‌లో పైమోటార్లు మూడు మరమ్మతులు కాగా, లో మోటర్లు మూడు ఏర్పాటు చేశారు. రెండు మోటార్లు నిరంతరం పనిచేస్తుంటాయి. ఒకటి ఉన్నా పనిజరిగేలా మరొకటి అదనంగా అత్యవసర సమయాల్లో ఒకటి మరమ్మతులకు గురైనా అదనపు మోటారు బిగించి నీటి సరఫరా ఆగకుండా చర్యలు చేపట్టారు.

నిద్రపోతున్న అధికారులు..

అయితే గత కొంతకాలంగా రెండు విద్యుత్ మోటార్లు మరమ్మతులకు గురైనా వాటిని ఒంగోలులో మరమ్మతులకు ఇచ్చి తిరిగి తీసుకురాలేదు. ఒక మోటారుపై నీటి సరఫరా చేస్తున్నారు. అది కూడా మరమ్మత్తులకు గురికావడంతో నీటి సరఫరా పూర్తిగా నిలిపివేశారు. ఇక్కడ పనిచేసే రెగ్యులర్ అధికారులు బదిలీపై వెళ్లటంతో ఇక్కడ మరొకరిని నియమించకుండా వేరే మండలాల అధికారులకు ఇన్‌చార్జి ఇవ్వడంతో పర్యవేక్షణ లోపించింది. పై స్థాయి అధికారులు పర్యవేక్షించకుండా కార్యాలయాలకే పరిమితమయ్యారు. కిందిస్థాయిలో రెగ్యులర్ సిబ్బంది లేకపోవటం, కాంట్రాక్టు సిబ్బంది కావటంతో మరమ్మతులు చేయించటం, ఏదైనా సమస్య వస్తే దానిపై సరైన నిర్ణయం తీసుకునే అర్హత లేదు. దీంతో ఎస్ఏపీ రక్షితనీటి పథకం నిర్వహణ సక్రమంగా జరగటం లేదు. ఇప్పటికైనా ఎస్ఏపీ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి ఎస్ఏపీ రక్షిత నీటి పథకానికి సరిగా పర్యవేక్షణ చేసే అధికారిని నియమించాలి. వేసవిలో తాగునీటి సరఫరా నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దేవస్థానాల వార్షికోత్సవంలో పూజలు చేసిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వీహెచ్‌పీ అంతర్జాతీయ కార్యదర్శి రాఘవులు

యర్రగొండపాలెం: దేశంలో హిందూత్వం ఆర్‌ఎస్ఎస్, వీహెచ్‌పీ వల్లనే ముందుకు వెళ్తుందని, ఆ సంఘీయులు నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని కొలుకుల గ్రామంలో శివాలయం, వెంకటేశ్వర స్వామి దేవస్థానాల వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గాయత్రి హోమాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పూర్తిగా వెనకబడిన ప్రాంతంలో ఇటువంటి హోమాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. 108 గాయత్రి హోమాల కార్యక్రమంలో 24 గ్రామాల నుంచి 432 మంది దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ కార్యదర్శి యక్కలి రాఘవులు, జిల్లా అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి వీరారావు, హరిద్వార్ శాంతికుంజ్‌కు చెందిన గాయత్రి పరివార్ అర్చకులు విక్రమ్, సందీప్, శ్రీశైలం, రఘు, త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, యక్కలి వెంకటసుబ్బారావు, గ్రంధే రమణారావు, అనిశెట్టి ఏడుకొండలు, పి.రామచంద్రయ్య, యక్కలి అప్పారావు పాల్గొన్నారు.

దేశానాయక్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



రాములు నాయక్ కుటుంబాన్ని ఓదార్చుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్



లచ్చానాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

పుల్లలచెరువు: ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దేశావత్ లచ్చానాయక్ కుటుంబాన్ని ఆదివారం స్థానిక శాసన సభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ పరామర్శించారు. ఆయన ఆదివారం చిన్న పీఆర్సీ తండాలో లచ్చానాయక్ ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం శనివారం మల్లాపాలెం రహదారి ప్రమాదంలో మృతిచెందిన రాములు నాయక్ కుటుంబాన్ని కూడ ఆయన పరామర్శించారు.

ఆయన వెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వరనాయక్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

వెలుగొండ ప్రాజెక్టును మోసం చేసిన కూటమి



అనంతవరంలో కాలువ పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

దొనకొండ: వెనుకబడిన దొనకొండ మండలానికి వెలుగొండ నీరు వస్తే మండలం అభివృద్ధి చెందుతుందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తాండవ రంగారావు, మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య తెలిపారు. ఆదివారం సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు నిధులు కేటాయించి పూర్తి చేసి మొదటి టన్నెల్ నుంచి సాగు నీరు విడుదల చేయాలని కోరుతూ మండలంలోని రుద్రసముద్రం, మల్లంపేట, మంగినపూడి, అనంతవరం, చిలకలపల్లి, రాగమక్కపల్లి, వల్లభనేనిపల్లి, ఇండ్లచెరువు, గంగదేవిపల్లి గ్రామాల్లో సాగింది. మార్చి 20వ తేదీన మార్కాపురం ఆర్‌డీఓ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలో రైతులు, కూలీలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేసి నేటికి 29 ఏళ్లు అయినా ఇంతవరకు పూర్తి చేసి నీరు విడుదల చేయక పోవడం పాలక పార్టీల నిర్లక్ష్యానికి నిదర్శనమని, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తాం సాగు నీరు అందిస్తామని చెప్పిన మాటలు నీటిలో మూటలయ్యాయన్నారు. అనంతవరం గ్రామంలో సాగు నీటి ప్రధాన కాలువ పరిశీలించగా చిల్ల చెట్లతో, పూడికతో ఉందని, ప్రజాధనం వృథా చేయకుండా పాలకులు దొనకొండ ప్రాంతాన్ని అభివృద్ధి పరచాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుందుర్తి చిన్న నరసింహులు, కోలా కిరణ్‌కుమార్, కోటేశ్వరావు ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం కేసు నమోదు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో నివసిస్తున్న చల్లా మమత (13) ఈ నెల 14వ తేదీనుంచి కనిపించడం లేదని తల్లి శివకుమారి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర పేర్కొన్నారు.

వృద్ధుడు అదృశ్యం

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు గ్రామానికి చెందిన నక్కా పెద మాలకొండయ్య(70) ఈ నెల 10వ తేదీ కందుకూరు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడని, అప్పటి నుంచి కనిపించడం లేదని కుమారుడు శ్రీనివాసులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన మిరప లోడు లారీ



అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

కురిచేడు: మిరపకాయల లోడు లారీ అదుపుతప్పి ఓ ఇంటిపైకి వెళ్లింది. ఈఘటన మండల కేంద్రం స్థానిక షిరిడిసాయిబాబా మందిరం సమీపంలో ఆదివారం జరిగింది. వినుకొండ కు చెందిన లారీ దొనకొండ మండలం ఇండ్లచెరువు నుంచి గుంటూరు మిరపకాయల లోడుతో వెళ్తోంది. ఈక్రమంలో లారీ అదుపు తప్పి ఇంటి ముందున్న బైక్‌ను ఢీకొట్టి ఇంటిపైకి వెళ్లింది. అదృష్ట వశాత్తు ఆ సమయంలో ఎవరూ బయట లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఇదేనా స్వచ్ఛమైన పనులు..

● రోడ్లపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు
● ఫొటోలకు పోజులిచ్చేందుకే స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం



కాలువలో పేరుకపోయిన చెత్తచెదారాలు

కురిచేడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమం తూతూ మంత్రంగా ఫోటోలకు పోజులిచ్చేందుకే ఉందని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. ప్రతి నెలా మూడో శనివారం ప్రభుత్వం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మండంలోని అన్ని గ్రామాలు పారిశుద్ధ్య లోపంతో కొట్టుమిట్టాడతున్నాయి. మండలంలోని పొట్లపాడు గ్రామంలో ఏ వీధి చూసినా డ్రైనేజిలు మురుగుతో నిండి దుర్వాసన వెదజల్లుతూ దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. గ్రామంలో తాగునీరు కుళాయిలు డ్రైనేజి మీద ఉండటంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. శనివారం ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించి ప్లాస్టిక్ కవర్లు లేకుండా చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. అన్ని షాపులలో, వ్యాపార కేంద్రాల్లో సింగిల్ యూజ్ కవర్లు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపైనే వేసిన చెత్త కుప్ప